క్లుప్తంగా

హుండీ ఆదాయం లెక్కింపు



పోచమ్మదేవాలయంలో హుండీని లెక్కిస్తున్న ఆలయ కమిటీ నేతలు

మన్సూరాబాద్: మన్సూరాబాద్‌లో పోచమ్మ దేవాలయ హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.73 వేలు ఆదాయం వచ్చిందని ఆలయ కమిటీ చైర్మన్ కొప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నేతలు పోచబోయిన గణేష్‌యాదవ్, నాంపల్లి శంకరయ్య, రాజేందర్, అమర్ పాల్గొన్నారు.

హుండీ చోరీ..

పోచమ్మ దేవాలయ హుండీని గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బోనాల ఉత్సవాల మరుసటి రోజు సోమవారం రాత్రి ఆలయంలోని ప్రవేశించి ఆలయ గ్రిల్స్ తొలగించి ఒక హుండీని దొంగిలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సమాచార హక్కు ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలి



జెడ్సీ వెంకన్నకు ఫిర్యాదు చేస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి పనుల విషయమై ప్రజాప్రతినిధిగా తాను సమాచార హక్కు చట్టం కింద అడిగిన వివరాలను సకాలంలో అందించకుండా ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆమె మొదటి అప్పీలేట్ అధికారి, చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఐఎస్‌సదన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల విషయమై నెల రోజుల క్రితం తాను సంతోష్‌నగర్ సర్కిల్ అధికారులకు ఆర్టీఐ సమాచారం కోసం అభ్యర్థించానని నెల రోజులైనా తనకు వివరాలు ఇవ్వలేదన్నారు. సమాచార హక్కు ఉల్లంఘనలకు పాల్పడిన సంతోష్‌నగర్ డిప్యూటీ కమిషనర్, ఇంజనీరింగ్ విభాగం అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్‌రెడ్డి

మీర్‌పేట: బీజేపీ మీర్‌పేట ప్రధాన కార్యదర్శిగా గాయత్రినగర్‌కు చెందిన జిల్లా మజ్దూర్ మోర్చా మాజీ అధ్యక్షుడు కసిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజ్‌భూపాల్‌గౌడ్ చేతుల మీదుగా గురువారం నియామకపత్రం అందుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేషన్‌లో పార్టీ పటిష్టతకు కృషి చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్తానని తెలిపారు. తన పదవి కోసం కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్, జిల్లా మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, కొలన్ శంకర్‌రెడ్డి, కీసర గోవర్ధన్‌రెడ్డి, ముఖేశ్ ముదిరాజ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో గురువారం బోనాల ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి పోచమ్మ, మైసమ్మ అమ్మవార్లకు నైవేద్యాన్ని సమర్పించారు. చల్లగా చూడు తల్లీ అంటూ అమ్మవార్లను వేడుకొన్నారు. మాజీ కార్పొరేటర్లు, మాజీ ఎంపీటీసీలు, గ్రామపెద్దలు బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు

వసతుల కల్పనకు వినతి

బడంగ్‌పేట్: మున్సిపల్‌కు ఆనుకొని ఉన్న శ్రీమారుతీనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేణు అన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం కాలనీవాసులు ఆయనతో కలిసి కమిషనర్ పి.సరస్వతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రీమారుతీనగర్ రోడ్ నంబర్ 1, 2లో డ్రైనేజీ నిర్మాణం అసంపూర్తిగా ఉందని తెలిపారు. డ్రైనేజీ కాల్వల పనులు పూర్తి చేయించాలని కోరారు. కాలనీలో విద్యుత్ లైట్లు లేక చీకట్లో అనేక ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు. చిన్నారులు, విశ్రాంతులు చీకట్లో నడవలేకపోతున్నారన్నారు. ఖాళీ ప్లాట్లల్లో పిచ్చిమొక్కలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయని బయటకు వెళ్లాలంటే కాలనీవాసులు బయపడుతున్నారన్నారు. కుక్కల బెడద ఎక్కువగా ఉందని వీధికుక్కలను పట్టుకుపోవాలని విన్నవించారు. అదేవిధంగా సీసీరోడ్లు లేక గతుకుల, అంతర్గత మట్టి రోడ్లతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

భారీ వర్షం.. రోడ్డు ధ్వంసం



ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు అంతర్గత రహదారులు ధ్వంసమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోడ్లు రహదారులు కోతకు గురైనా వాటి గురించి పట్టించుకునే నాథులే లేరని ఆయా ప్రాంతాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట్‌జోన్ పరిధిలోని ఆర్‌కేపురం, సరూర్‌నగర్, చావుణీ, ఐఎస్‌సదన్, అక్బర్‌బాగ్ ఇలా ఏ ప్రాంతంలో చూసినా రోడ్లన్నీ ధ్వంసమై కనిపిస్తున్నాయి. వివిధ శాఖల అధికారుల సమన్వయ లోపంతో మరమ్మతులకు నోచుకోవడం లేదు. ధ్వంసమైన రోడ్లకు మరమ్మతు చేయాలని పలుమార్లు సంబంధిత అధికారులతో మొర పెట్టుకున్నా పట్టించుకోవడం లేదని ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేయాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. – దిల్‌సుఖ్‌నగర్

బురదమయం.. అడుగేయలేం



తరచూ కురుస్తున్న వర్షాలకు పలు ప్రాంతాల్లో నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎల్‌బీనగర్ నియోజకవర్గం పరిధిలోని శివారు కాలనీల్లో నేటికీ మట్టి రోడ్లే ఉండటంతో వర్షాలకు గుంతల్లో నీరు నిలుస్తోంది. దానికి తోడు బురదమయంగా మారుతుండటంతో పాదచారులు, వాహనదారులు జారి కింద పడిపోతున్నారు. కాలనీలకు వెళ్లేదారి లేక బురదలో నుంచే వెళ్తున్నారు.బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో వర్షంనీరు చేరడంతో దారంతా బురదమయంగా మారింది. తమ కాలనీలకు ఎప్పుడు సీసీ రోడ్లు వేస్తారో.. మా సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారో అని ఆయా ప్రాంతాల వారు ఎదురు చూస్తున్నారు. – ఎల్‌బీనగర్

అమావాస్య అన్నదానం



అన్నదాన వితరణ చేస్తున్న ట్రస్ట్ సభ్యులు



హనుమాన్ నగర్ కాలనీలో..



చంపాపేట: అన్ని దానాలలో కన్నా అన్నదానం మిన్న అని శ్రీమాతా అన్నపూర్ణేశ్వర అన్న ప్రసాద వితరణ ట్రస్ట్ చైర్మన్ దండేటికార్ భగవాన్‌జీ అన్నారు. గురువారం ట్రస్ట్ ఆధ్వర్యంలో చంపాపేట మూడు గుళ్ల ఆవరణలో నల్ల, ఎర్ర పోచమ్మ అమ్మవారి ఆలయం ముందు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా భగవాన్‌జీ మాట్లాడుతూ..ప్రతి అమావాస్య రోజున అన్న ప్రసాదాన్ని వితరణ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రవి ముదిరాజ్, సుశీల్‌కుమార్, సంతోష్, ప్రవీణ్, చింటు, రాజు, వెంకటేష్, రాజేష్, రమేష్, శ్రీను, మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

- చైతన్యపురి హనుమాన్నగర్ కాలనీలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గురువారం అన్నదానం నిర్వహించారు.



విద్యార్థులకు బ్యాగుల పంపిణీ

మన్సూరాబాద్: జక్కిడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం బ్యాగులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి పాల్గొన్నారు.



అష్టలక్ష్మి అమ్మవారు

తొలి శ్రావణ శుక్రవారానికి ఏర్పాట్లు పూర్తి

దిల్‌సుఖ్‌నగర్: మలక్‌పేట్‌జోన్ పరిధిలో అన్ని ఆలయాల్లో శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలు, పూలమాలలతో అలంకరించారు. జోన్ పరిధిలోని ఆర్‌కేపురం వాసవికాలనీలోని శ్రీఅష్టలక్ష్మీ ఆలయం, దిల్‌సుఖ్‌నగర్‌లోని సంతోషిమాత ఆలయం, శ్రీదుర్గాదేవి దేవాలయం, మలక్‌పేట్‌లోని శ్రీఅండాళ్ నిలయం, అక్బర్‌బాగ్‌లోని హరిహరక్షేత్రం, సైదాబాద్‌లోని శ్రీజయదుర్గా, శ్రీవిజయదుర్గాదేవి అమ్మవారి ఆలయం, మాదన్నపేట్‌లోని దుర్గాదేవి ఆలయం, ఐఎస్‌సదన్ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్క నాటుతున్న కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్, లింగోజిగూడ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్ పరిధి జానకీ ఎన్‌క్లేవ్ పార్కులో కార్పొరేటర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీవాసులు తప్పనిసరిగా తమ ఇంటి ఎదుట మొక్కలు నాటి సంరక్షించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ యూసీడీ మేనేజర్ శ్రీనివాస్, నాయకులు పలుసం శ్రీధర్‌గౌడ్, యశ్వంత్, అనసూయ, ప్రవీణ్‌రెడ్డి, నరేందర్, రోహిత్, వెంకట్, కాలనీవాసులు మల్లీఖార్జున్, చంద్రశేఖర్, రాంబాబు, లక్ష్మారెడ్డి, శకుంతల పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులతో భరత్‌రెడ్డి

నూతన కార్యవర్గం ఎన్నిక

మలక్‌పేట: గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ యూనిట్ నూతన అధ్యక్షుడిగా మూసారంబాగ్‌కు చెందిన పున్‌రెడ్డి కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. మలక్‌పేట సలీంనగర్‌లోని తెలంగాణ స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా పున్‌రెడ్డి కృష్ణారెడ్డి, ప్రధానకార్యదర్శిగా రమాదేవి, కోశాధికారిగా కృష్ణహరి, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా సుధాకర్, ఉపాధ్యక్షులుగా కే.మోహన్, కృష్ణ, లలిత, సరోజమ్మ, సుభాష్‌గౌడ్, యాదగిరి, సరోజిని, రామాచారి, చంద్రశేఖర్, దయానంద్, సుదర్శన్, నరసింహ ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ చోళా ఓం ప్రకాశ్ నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు

టమాటా రూ.43, వంకాయ రూ.18, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.65, కాకరకాయ రూ.23, బీరకాయ రూ.23, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.40, దొండ రూ.20, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.22, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.15, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.26, మునగ రూ.28, కందగడ్డ రూ.50, బీట్‌రూట్ రూ.28, కీర రూ.35, బీన్స్ రూ.60, క్యాప్సికమ్ రూ.65.

ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

నేడు డయల్ యువర్ డీఎం

హయత్‌నగర్: ఆర్టీసీ సేవలపై ప్రయాణికుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు వారి నుంచి సలహాలు, సూచనలు తీసుకునేందుకు శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు హయత్‌నగర్-1, 2 డిపో మేనేజర్లు విజయ్, శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందని ప్రయాణికులు 9959226138, 9959226419 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

చెక్కు అందజేత

మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కిగౌడ్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌కు చెందిన చెన్నూరి ప్రియాంకకు సీఎం ఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడు పేదల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు.

శివారు కాలనీల్లో వీధి దీపాల ఏర్పాటు

ఎల్‌బీనగర్: అంధకారంలో ఉన్న కాలనీల్లో కొత్తగా వీధి దీపాలు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాల నుంచి శివారు కాలనీలకు వీధి దీపాలు లేకపోవడంతో అంధకారంగా ఉండేవి. వీధి దీపాలు ఏర్పాటు చేయాలని అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో గత కొన్ని నెలలుగా శివారు కాలనీలు అంధకారంలోనే ఉండాల్సి వచ్చింది. ఎట్టకేలకు శివారు కాలనీల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయడంతో ఆయా ప్రాంతాల వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు లేని కాలనీల్లో త్వరలో ఏర్పాటు చేస్తామని ఏఈ ప్రసాద్ పేర్కొన్నారు.

జువైనల్ హోమ్ నుంచి ఐదుగురు పరారీ



సైదాబాద్‌లోని జువైనల్ హోమ్

సైదాబాద్: సైదాబాద్‌లోని ప్రభుత్వ జువైనల్ హోం నుంచి ఐదుగురు బాలలు పరారైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివిధ నేరాల్లో సైదాబాద్‌లోని జువైనల్ హోమ్‌లో ఉన్న బాలలు మంగళవారం రాత్రి ఐదుగురు గోడ దూకి పరారయ్యారు. బాలల పరారీ విషయమై జువైనల్ అధికారులు సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది.



పురస్కారాలు అందజేస్తున్న వెంకటేశం

ఉత్తమ సిబ్బందికి అవార్డులు

నాగోలు: ఆర్టీసీ డిపోలో ఉద్యోగులందరూ నిబద్ధతతో పనిచేస్తూ డిపోను లాభాల బాటలో తీసుకురావడానికి కృషి చేయడం అభినందనీయమని బండ్లగూడ డిపో మేనేజర్ వెంకటేశం అన్నారు. జూన్ నెలకు సంబంధించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి డిపో ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. డిపోలో అత్యాధిక కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు, అధిక ఆదాయం తీసుకువచ్చిన కండక్టర్లు గ్యారేజ్ సిబ్బందికి ప్రశంస పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శాలిని, మెకానికల్ ఇంజినీర్ బాల యోగేశ్వరి, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

'కేర్'లో అరుదైన శస్త్రచికిత్స



ఆపరేషన్ నిర్వహిస్తున్న వైద్యబృందం

చాదర్‌ఘాట్: కేవలం 30 కిలోల బరువు ఉన్న 29 ఏళ్ల మహిళకు మలక్‌పేట కేర్ హాస్పిటల్‌లో అత్యంత క్లిష్టమైన మిట్రల్ వాల్వ్ మార్పిడి శస్త్రచికిత్స చేశారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, మూర్ఛలు, హైపోథైరాయిడిజం వంటి సమస్యలతో బాధపడుతున్న ఆమెకు గుండె మిట్రల్ వాల్వ్ పూర్తిగా దెబ్బతిన్నట్లు తేలింది. తక్కువ బరువు, అనుబంధ సమస్యలతో శస్త్రచికిత్స ప్రమాదకరంగా మారింది. సీనియర్ కార్డియోథొరాసిక్, వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుధీర్ గంద్రకోట నేతృత్వంలోని కార్డియాక్ సర్జరీ బృందం ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ సుధీర్ మాట్లాడుతూ.. ఇది అత్యంత క్లిష్టమైన కేస్, బరువు తక్కువగా ఉండటం, ఇతర ఆరోగ్య సమస్యలు ఉండటంతో సర్జరీ ప్రమాదకరంగా మారింది. అయినప్పటికి మా బృందం శస్త్ర చికిత్స విజయవంత చేసిందన్నారు.

విద్యుత్ అధికారుల పనితీరు భేష్



ఓల్డ్‌మలక్‌పేటలో బస్తీబాటలో పాల్గొన్న సౌత్‌జోన్ ఎస్‌ఈ సోమిరెడ్డి, ఏఈ ప్రసాద్ తదితరులు

చాదర్‌ఘాట్: విద్యుత్ సీఎండీ ఆదేశాల మేరకు మలక్‌పేట నియోజకవర్గం ఓల్డ్‌మలక్‌పేట మహబూబ మాన్షన్ గంజిలో గురువారం బస్తీబాట నిర్వహించారు. ఈ సందర్భంగా సౌత్‌జోన్ ఎస్‌ఈ సోమిరెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ సీఎండీ ఆదేశాల మేరకు ప్రతివారంలో ఒకరోజు విద్యుత్ సమస్యలపై బస్తీబాట నిర్వహిస్తున్నామన్నారు. బస్తీల్లో ప్రజలు ఎదురుకొంటున్న విద్యుత్ సమస్యలు తెలుసుకొని వాటిని అప్పటికప్పుడు పరిష్కరించడమే లక్ష్యమన్నారు. కిందిస్థాయి ఉద్యోగి నుంచి పైస్థాయి ఉద్యోగి వరకు బృందంగా ఏర్పడి ఒక్కో వారం ఒక్కో డివిజన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రమాదకరంగా ఉన్న స్తంభాలను గుర్తిస్తూ, వాటిని తొలగించి కొత్తవి వేసే ప్రణాళికలు అక్కడిక్కడే అమలు చేస్తున్నామని తెలిపారు. చాదర్‌ఘాట్ డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై ప్రజలు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని, వారి పనితీరు బాగుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడీఈ శోభన్‌బాబు, ఏఈలు ప్రసాద్, సంతోష్‌బాబు, భాస్కర్ పాల్గొన్నారు.

భారీ వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. గురువారం డివిజన్ పరిధిలోని కమలానగర్‌లో ఆయన పర్యటించి వరదనీటి కాలువ, భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్లను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపిన సందర్భంగా జీహెచ్‌ఎంసీ, హైడ్రా, జలమండలి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ వాహిని, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, నాయకులు సత్యనారాయణ, కాలనీ అధ్యక్షుడు టీ.వీ.రావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.



కమలానగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

చెట్లు, స్తంభాల వద్ద ఉండరాదు..



సుజాతనాయక్

హస్తినాపురం: భారీ వర్షాల కారణంగా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాఠశాలలకు వెళ్లే చిన్నారుల విషయంలో తల్లిదండ్రులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలనీలలో వరదనీరు ప్రవహించే నాలాలు మ్యాన్‌హోళ్లు ఉన్న ప్రాంతాల సమీపంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షాలు కురుస్తున్న ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగిపడే ప్రమాదం ఉందని వర్షం పడుతున్నప్పుడు ఎవరూ కూడా చెట్ల కింద, విద్యుత్ స్తంభాలను ఆనుకుని ఉండరాదన్నారు. ఇప్పటికే హైడ్రా, జీహెచ్‌ఎంసీ, డీఆర్‌ఎఫ్, ఎన్‌డీఆర్‌ఎఫ్, వాటర్‌వర్క్స్, బృందాల సహాయంతో బాధిత ప్రాంతాలలో సహాయక చర్యలు చేపడుతున్నామన్నారు.